పువ్వుల కొరడా!

ఎ. అప్పల్నాయుడు

తుమ్మపాలెం ఊరు అంత పెద్దదీకాదు- అలాగని చిన్నదీకాదు. మధ్యస్తంగా వుంటుంది. దాదాపు మూడు వందల ఏభై యిళ్లుంటాయి ఆ ఊరిలో. అందులో చాలా తక్కువ సంఖ్యలో కొన్ని జాతుల వారున్నారు ... చాకలి, మంగలి, బారిక లాంటి తక్కువ జాతి వాళ్లు. ఇలాంటి కులం తక్కువ వాళ్లయిన చాకలివారు ఆరేడు కుటుంబా లున్నాయి ఆ ఊరిలో. ఈ ఆరేడు కుటుంబాల చాకలివారే ఆ ఊరి మురికి (బట్టలు) పుతికి బాగుచేస్తుంటారు. ఇలా బాగుచేస్తున్నందుకు వారికి ఏడాదికి యిన్ని అని చెప్తా ధాన్యం లెక్కగట్టి ఆ వూరి ఆయా కుటుంబాల వాళ్లు యిస్తుంటారు. ఆరు ఏడు కుటుం బాల వాళ్ళు మూడువందలేభై యిళ్ల మురికి బట్టలు పుతకడం వలన అహర్నిషలు తీరికలేకుండా పనిజేస్తూంటారు. అయినా వీళ్ల బతుకులకు 'గడియ తీరదు, గవ్వ మిగ లదు' అనే సామెత సరిపోతుంది. గవ్వ మిగలని చాకలోళ్లలో అసిరిసెట్టి ఒకడు. అసిరిసెట్టి ఈమధ్య అంటే మొన్ననే తన చిన్నకూతురుకి పెళ్లి చేసాడు. సరిగ్గా ఈ పెళ్లి రోజునే తుమ్మపాలెం నాయుడుగారు కూతురుకి 'బంగారంపేట' వూరు భూస్వా మైన జగ్గు నాయుడుగారి ఎమ్మే చదివిన అబ్బాయిని యిచ్చి పెళ్లి చేసారు.

అసిరిసెట్టి కూతుర్ని తన చెల్లెలు కొడుక్కి యిచ్చి పెళ్లిచేసాడు, బంగారంపేట ఊరి భూస్వామిగారి ఎమ్మే అబ్బాయిని నాయుడుగారి కూతురుకిచ్చి పెళ్లిచేసారు- అని అనడానికి తేడా ఏమిటో తెలుసా మీకు?

అసిరిగాడి కూతురు పెళ్లికి అల్లుడే భరించాడు ఖర్చులన్నీ!

నాయుడుగారి అమ్మాయి పెళ్లికి, పెళ్లి ఖర్చులే కాక, పెళ్లికి కావలసిన సరుకులు కొన్నట్టే ఎమ్మే అబ్బాయిని అరవై వేలిచ్చి కొని తీసుకొచ్చి పెళ్లిచేసారు నాయుడు గారు! కనక అలా అనాల్సి వస్తోంది.

పెళ్లి కర్మా, కరమ్మత్తూ తగలని అసిరి గాడికి కూతురు అత్తారింటికి పయన మవుతుంటే ఏడుపొచ్చింది. ఏడుపొచ్చిన అసిరిగాడికి నాయుడింటి నుండి కబురొ చ్చింది. కూతుర్ని పయనం చేయించేసి, అసిరిసెట్టి నాయుడుబాబింటికి వెళ్లాడు.

నాయుడు గారిల్లు యింకా పెళ్లికళతో వుంది. ఇంటిముందు పెద్ద పెళ్లి పందిరి, దాని కిరింద మంచాలు చల్లని నీడలో కూర్చున్న సింహాల్లా వున్నాయి. అరవై వేల రూపాయలు దాటి కర్సైపోయినా అరగని రోడ్డు రోలర్‌లావున్న నాయుడుగారు ఆ

పందిరి నీడలోని సింహాల్లాంటి మంచాల అన్నిటికంటే పెద్దదైన పందిరికోళ్ల మంచం మీద కూర్చొని పడుకున్నారనొచ్చు ఆయన్ని చూసినవారు.

నాయుడు గార్ని చూసిన అసిరిసెట్టి పందిరికోళ్లనీ, మంచాన్నీ, చూసి గతుక్కుమని, ఆ మంచానికి దూరంగా, ఒక వోరగా నిలబడ్డాడు. నిలబడిన అసిరి సెట్టిని.... కూర్చొని పడుకున్న నాయుడుగారు "ఏఁవిరా! యింకా పెళ్లి అడావిడి తీరనే ద్రేటా నీకు! అలికిడే లేదిటు కేసి. యిదేటి పెళ్లి యిల్లు అనుకున్నావా, నేడా! లేక పోతే నీ కూతురి పెళ్లే ముక్క్యం అయిపోయిందా ఏటి?" అని (తన కూతురి పెళ్లి ఎక్కువగా భావించలేదీ సాకల్నా కొడుకు అని తన మనసులో అనుకుంటూ) అన్నారు.

"నేదు బాబో.... నానే వొద్దు మనుకుంతన్నాను యిక్కడికి. యింతలోకి మీరే కవురెట్టినారు"

"కవురెట్టకపోతే నువ్వొత్తావేట్రా. ఏసయి కాలం.... ఎండ.... ఏడెక్కిపోతావు గావా, గడప దాటవు నువ్వందుకే"

"అదేటి బాబో.... అలగంతారు. ఎండేటి. వోనేటి మాకు" ఇంతలో పెళ్లి కూతురు వారు నాయుడు గారి సెవిలో యేదో సెప్పడానికి వొచ్చారు.

పాలపిట్ట రంగు, బంగారం అంచుతో పట్టుచీర మెరుస్తోంది! మెరుస్తున్న చీరలో మెరవని పెళ్లి కూతుర్ని మెరిపెస్తున్నాయి నగలు, అలంకారాలు! అసిరిసెట్టి చూసాడు. పెళ్ళి కూతురంటే యిలా వుంటాది గావాల అనుకున్నాడు. పెళ్ళి కూతురైన తన కూతుర్ని తల్సుకున్నాడు. ఆమెకీ ఈమెకీ పోల్చుకుంటున్నాడు. ఎత్తైన భవంతిలో విహరించే రాణీలాగా నాయుడు గారి కూతురు కన్పిస్తే, దాని కిందనున్న పూరిగుడిసె లోని దాసీ దానిలా కన్పించింది తన కూతురు. ఇక మరి ఆలోచించ లేక పోయాడు. పెళ్ళి కూతురు కూడా వెళ్ళి పోయింది. తర్వాత నాయుడు గారు కూడా మంచం మీద నుండి లేచారు, లేచి రా....రా సెట్టోడా, యింట్లోని గొడ్డలి దీసికెల్లి, కళ్లంలోన ఎండు దుక్కలున్నాయి. అవి ముక్కలుజేసు కొచ్చీరా" అని పిలిచి గొడ్డలి యింట్లో ఎక్కడుందో చెప్పేసి, లోనకి వెళ్ళి పోయారు.

కళ్లంలోకెళ్లి దుక్కల్ని ముక్కలుజేసి గొట్టి, చెక్కలయిన వన్నీ ఏరుకొని మోపుగట్టి నాయుడుగారి వంటింట్లో పడేసి, తువ్వాలు గుడ్డతో మొహంమీది సెఁవట తుడుసు కుంటున్న అసిరిసెట్టిని జూసి, సేమ్యా పాయసం రుచి చూస్తున్న నాయురాలమ్మగారు "ఓరె, సెట్టోడా! మధ్యానం బేగి రమ్మిరా, వొంటలయిపోతాయి. [illegible] వారింటికి ఏనాలు కావిడొట్టు కెల్దువుగాని రమ్మిరో" అని అర్డరేసింది. ఆ ఆర్డరు వినగానే అసిరి

సెట్టి 'తన పసయి పోయిందిర బాబో' అనుకున్నాడు. "ఎండలు మండిపోతన్నాయి. ఇంత ఎండలోన కావిడి బరువుతోటి, ఏడెనిమిది మైయిల్లు దోవ వుంటాదావూరు, ఎల్లి రావడమంటే- మాటలా! సచ్చినాన్రా దేవుడా!" అనుకున్నాడు- దేవుడ్ని తలుసు కున్నాడు. "సాకలోడికి ఎందుకు పుట్టించావుర దేవుడా- అంతేలే, నీనేమి పాపం జేసానో యీజన్మెత్తాను- ఈజన్మెత్తినందుకీ కావిడి ఎత్తక తప్పదు గావాల!" అను కున్నాడు. యిలా ఆలోచిస్తూ యింటికొచ్చాడు.

ఇల్లంతా బోసిపోయివుంది. ఎవ్వరూ లేరు. ఒంటరి వాడయినాడు అసిరిసెట్టి చిన్న కూతుర్ని పెళ్లి చేసేసిన తర్వాత రెండేళ్ల కిందట అసిరిసెట్టి పెళ్లాం పోయింది. బట్టల మూట మోసుకొంటూ వీధిలో ఒస్తుంటే నాయుడుగారి పెద్ద కోడెద్దు రంకె లేసు కొస్తోంది. నాయుడుగారి రంకెలకి బలయిపోయిన అనేకమంది స్త్రీలలాగే నాయుడుగారి ఎద్దు రంకెలకు బలయిపోయింది అసిరిసెట్టి పెళ్లాం. ఎద్దు కొమ్ముతో కడుపులో పొడి సేసి పేగులు లాగేసింది. గావుమని అరిచి చచ్చిపోయింది అసిరిసెట్టి పెళ్లాం. చచ్చి పోయిన సెట్టి దాన్నిసూసి ఏడవకుండా వుండలేకపోయాడు అసిరిసెట్టోడు. ఏడుస్తున్న యిద్దరాడ కూతుళ్లనీ ఓదార్చలేకపోయాడు. ఏడుస్తున్న ముగ్గుర్ని ఊరుకోమన్నాడు- సెట్టి దాన్ని ఖననం చేయించేసాడు నాయుడుగారు. సెట్టి దాని ఖననం అయిపోయిన రెండోరోజే పెద్ద కూతురు తన అత్తోరి యింటికి వెళ్లిపోయింది. వున్న చిన్నకూతుర్తో యిన్నాళ్లూ బతుకుతూ, బట్టలుతుకుతూ గడుపుకొచ్చాడు. ఇకనుండి ఒంటరే! ఎలా బతకడం! బట్టలుతికితే, వొంట వొండలేడు, వొండితే బట్టలుతకలేడు! గనక అసిరి సెట్టికి నాయుడుగారి పెద్ద ఎద్దు మళ్లీ రంకెలేస్తే బాగుండుననీ, సెట్టి దాన్లాగే ఆ ఎద్దు రంకెలకి బలయిపోతే బాగుణ్ణని అనిపిస్తోంది.

అపునంతే తెల్లారి లేసిందగ్గిట్నించి, రాత్రి తొంగొనే ఏలదాక, ఎదవ బాధ తప్పకపోతే యిక బతికెందుకు.

ఇలా బతుకెందుకని అనుకుంటున్న అసిరిసెట్టికి చావు కూడా ఎందుకో తెలీదు. చావూ, బతుకుల పరమార్థం తెలీని అసిరిసెట్టికి అయిదేళ్ల కొకసారొచ్చే ఎలక్షన్లంటే పండగనీ, ఆ పండగల్లో పెద్దవాళ్లు తమ దగ్గరకి వొస్తారనీ, సారా పోస్తారనీ, నోట్లి స్తారనీ తెలుసు. అయిదేళ్ల పండగంటే యింతే తెలుసు తప్ప, ఆ పండగ తర్వాత ఆ సదరు పెద్దలు ఎంజేస్తున్నారో, ఆ పండగల రహస్యాలేమిటో అసిరిసెట్టికి తెలీదు. ఎలక్షనంటే తెలీని అసిరిసెట్టికి ప్రజాస్వామ్యమూ, సోషలిజము అర్థం కాదు. ఇవేవీ అర్థం కాని అసిరిసెట్టికి స్వాతంత్ర్యమంటే ఏమిటో గూడా తెలీదని అర్థం చేసుకోవచ్చును కదా మనం!

స్వాతంత్ర్యమంటే తెలియని అసిరిసెట్టిని నాయుడుగారు సరీగా మధ్యాహ్నం రెండుగంటల వేళ ప్రయాణం కట్టించారు— అరిసెల కావడిమీద చీరసారెలు పెట్టి వారి వియ్యపుల యింటికి!

ఈ కావిడి మోత తప్పడానికి తనకి జబ్బొచ్చినా బాగుణ్ణు! కాలిరిగిపోయుండినా బాగుణ్ణు అనుకున్నాడు. పుట్టించి నాడనుకుంటున్న దేవుడు దయతలిసినా బాగుణ్ణు! అయినా అసిరిసెట్టికి జబ్బు రాలేదు, కాలిరగలేదు.... దేవుడు దయసూపలేదు— కావిడి మోత తప్పలేదు పస సెట్టోడికి పాపం!

కావిడి భుజమ్మీదేసుకొని సరిజేసుకుంటున్న అసిరిసెట్టిని "జాగర్తరో, తోవలో నెక్కడేనా పడీసీగలవు సామాన్లు— అరిసె లవీ లెక్కబెట్టీ ఎట్టాను, తక్కువని అన్నారా నీకు తొక్కలూడిపోతాయి స్మీ!" అని నాయురాలు హెచ్చరించారు.

"సర్లేయే, ఆడికి తెల్దేటి? సెట్టోడా! మా ఈరకాడికి, ఈ సాయింత్రం అల్లుడూ కూతురు ఎలిపోవస్తారని సెప్పురా, ఏటి" అని నాయుడుగారు అంటే, నాయురాలు 'అల్లిద్దరేనేటి?' అని నాయుడిని ప్రశ్నించి, సెట్టోడికి మళ్ళీ "ఒరే! అల్లిద్దర్తోటీ మరో ఆరేడుగురు పేరంటాలు వొస్తారని సెప్పురా" అని అన్నారు.

ఇలా ఆఖరుసారిగా నాయుడూ, నాయురాళ్ల హెచ్చరికలూ, కబురులూ అయిపోయిన తర్వాత అసిరిసెట్టి అరిసెల కావిడి ఎత్తుకొని భుజమ్మీద సర్దుకొని పయనమైపోయాడు.

తుమ్మలపాలెం ఊరునుంచి కుడివైపుగా కొంతదూరంలో 'నాగావళి' నది పారుతోంది. దాన్ని దాటి ఆరు ఏడు మైళ్ళు దోవ వుంటుంది బంగారమ్మపేట వూరుకి— ఈ వూరువెళ్లే మధ్యలో రెండు వూర్లు తొడుము, మాదలంగి అనేవి తగుల్తాయి.

ఈ మాదలంగి అనేవూరే అసిరిసెట్టి పెద్దకూతురు అత్తవారుంటున్నది. ఎండలో కావడి మోత కష్టంగావున్నా, 'పోనీలే దోవలోనేకదా కూతుర్నిల్లు సూసీవొచ్చు, సిన్న దాని పెల్లికి కూడా రానేదు ఎందుకోగానీ' అని అనుకుంటూ అసిరిసెట్టి పెద్దకూతురు గూర్చి ఆలోచించుకుంటూ తోవలోని ఒక వూరుదాటి పోయాడు.

మధ్యలో కొంతమంది తెలిసిన చిన్న చిన్న రైతులు కన్పించి "ఏటి సెట్టోడా! యింత ఎండేల కావిడొట్టికెలతన్నా వెక్కడికేటి?" అని అడిగారు. "అ[illegible] నాయుడు బావు యీరకాలింటికి బాబు! బంగారంపేట" అని జవాబిస్తూ నడుస్తున్నాడు అసిరిసెట్టి.

'కూతురింటికి ఎల్లాల' అని అనుకున్నాడే గానీ అసిరిసెట్టికి, "ఎల్లినతరవాత దాని గుంటలు యిద్దరూ సూత్తారు తాత ఏటి తెచ్చాడో అనుకొని, తోవల ఏటేనా కొనుక్కోని తీసికెల్తే బాగున్ను" అనుకుంటండు. కానీ, జేబుల పైసాలేదు- తోవల కర్సు లుంటాయని జేబుకి తెలీదు। పంపించిన బాబుకీ తెలీదు।

కాలీ జేబుల అసిరిసెట్టి, అరిసెల కావిడితో ఎలాగైతేమి మాదలంగి చేరుకొని, చెల్లెలింటికి ఎల్లాడు. చెల్లెలు అన్నను చూసి ఎగిరిపోయింది ఆనందంతో. "ఇదేట్రనాయినా! యింతెండల బయలెల్నావు ఒక సిటం తాలనేకపోయినావా" అంది.

"ఎంతెండయితే ఏటి జేత్తామే కూతురా! నాయుడోల్లకి ఎండ నేదుకదా! పందిరి కిందని, పందిరికోళ్ల మంచంమీదిన సక్కగ తొంగొంతరు. మనల్ని ఎండల తోలుతారు- ఏటి సేత్తాం మరి, ఎల్లపోప్పతే తంతారు" అని చెప్పేసి "బాను గానీ, సిన్నమ్మి పెల్లికి నువ్వు రాలేదేమే" అని అడిగాడు.

ఇంతలో అసిరిసెట్టి కూతురు పిల్ల లిద్దరూ వొచ్చారు- 'తాత్తాత!' అని ఓక్షణం గెంతేసి, తాతమీద ఆడేసికొని పెళ్లిపోయినారు- కూతురు: "వుండ్రయ్యా టీ తెత్తాను సింవాచెలం కొట్టుకాడ" అని సెట్టోడు వొద్దన్నా వినకుండా వెళ్లింది.

మాటల్లో అసిరిసెట్టి అరిసెల కావడి సూడ్డం మర్సిపోయినాడు. తాత ఏటీ తేలేదని గ్రిహించిన పిల్లలిద్దరూ కావిడి సేరుకున్నారు.

అసిరిసెట్టి కావిడి సూసాడు- గుండె లారిపోనాయి.

అసిరిశెట్టి పదిలంగా మోసుకొస్తున్న నాయుడుగారి ఆస్థిని దోచుకుతింటున్నట్లు కన్పించింది ఆ దృశ్యం।

ఇద్దరుపిల్లలూ, కావిడిదగ్గిట కూర్చుని చెరోరెండు, పంచదార అరిసెలు తింటున్నారు. నల్లగా చీముడు కారేముక్కుల్తో, దిశమొలల్తోవున్న ఆ పిల్లలు అరిసెల్ని ఆప్యాయంగాతింటూ పరిసరాల్నే మరిచిపోయారు।

అసిరిశెట్టికి నోట మాటరాలేదు. నాయురాలి హెచ్చరిక వినిపించింది. గుండెలు వొడుకుతున్నాయి. రెండు, రెండు నాలుగు అరిసెలు తక్కువ। అమ్మో! అయిపోద్ది నాపని అనుకున్నాడు.

ఇంతలో కూతురొచ్చింది టీతో! అసిరిశెట్టి పిల్లల్ని సూపించాడు! తుళ్లపడ్డాది కూతురు! "అమ్మో! అమ్మో! ఎదవ గుంటలకానా! ఎంతపని సేసార్రా. అనేటి మన తిండి కనుకున్నారేటర్రో!" అని అడిగింది. అవి ఎవరిదిండికో, ఎవరికోసమో అనే

532

సంగతి పిల్లలకు ఎలా తెలుసు? తెలీని పిల్లల్ని బాదీసింది తండ్రి కేటవుతాదో అనే భయంతో. పిల్లలు ఏడుస్తున్నారు. అసిరిశెట్టి మనసులో సంజాయిషీగూర్చి రిహార్సల్సు వేస్తున్నాడు. కూతురు తిడుతోంది, పిల్లల్ని కొడుతోంది.

అప్పుడే రేడియో 'శ్రీలంక' స్టేషన్ నుండి "పిల్లలూ దేవుడూ చల్లనివారే, కల్లకపట మెరుగనీ కరుణామయులే" వినిపిస్తోంది। పాట వినే నాధుడూ. కరుణించే మహనీయుడూ పిల్లలకీ, అసిరిసెట్టికీ, కూతురికి కన్పించనే లేదు।

కూతురిచ్చిన టీ తాగేసాడు, ఏడుస్తున్న పిల్లల్నొదిలేసాడు- బంగారంపేట చేరి, నాయుడుగారి ఎమ్మెల్ల అల్లుడుగారి యిల్లు చేరుకున్నాడు.

నాయుడుబాబు యొక్క వియ్యపువారు కావిడి సరంజామా అంతా యింటిలో భద్రపరచుకొని అసిరిసెట్టికి కాలీ కావిడి యిచ్చేశారు. దాంతోపాటుగా ఒకరూపాయి కూడా యిచ్చారు.

ఒక రూపాయి!

కావిడి మోసిన అసిరిసెట్టికి, మోయించుకున్న జగ్గు నాయుడుగారు యిచ్చారు.

దాన్ని కూలి అంటారా?

దాన్ని బహుమాన మంటారా??

దాన్ని రూపాయే అంటాము ముందు మనము.

అది కూలీ కాదు, బహుమానమూ కాదు- భూస్వామ్య దర్పం విదిలించిన ఎంగిలి మెతుకు! ఫ్యూడల్ ప్రభువులు విసిరేసిన చిల్లర నాణెం!!

తరతరాలుగా గ్రామాల్లోని చాకలి, మంగలి, బారిక లాంటి జాతులు భూమిలేని కూలి రైతాంగంకంటే హీన స్థితిలో మగ్గుతూ, భూస్వాముల ఊడిగము చేస్తున్నారు. వారి కావిడి మోస్తున్నారు- సవారీ మోస్తున్నారు- కాళ్లు పడుతున్నారు- కర్రలు కొడుతున్నారు. ప్రతిఫలం యిదే రూపాయో, (లేక) ఎంగిలి మెతుకో!

ఇచ్చిన రూపాయి పుచ్చుకొని వారివద్ద సెలవు దీసుకొని అసిరిసెట్టి తిరిగి ప్రయాణమయ్యాడు.

ప్రతీ కార్యక్రమం యొక్క ఫలాఫలాలు వెంటనో. తర్వాతనో తప్పకుండా వుంటాయి.

నాలుగు అరిసెలు లెక్కతెలియవ్వతే అని వేధించే మనసుని సరిపెట్టుకునేవాడు అసిరిసెట్టి.

పెళ్లితంతులో యిచ్చిపుచ్చుకొనే సమయాల్లో లెక్కలు అచ్చితంగా వెల్లడౌతాయి. అవేమి ప్రణాళికా లెక్కలు కావుగా! ఆ రకంగానే నాలుగరిసెలు తక్కువయ్యాయని వెల్లడైంది. వియ్యపువారు నాలుగు వేలు తక్కువలా వ్యాఖ్యానాలు ప్రారంభించారట.

నాయురాలకి తెలిసింది- "ఎందుకు తక్కువౌస్తాయి, ఎదవ, యీ సాకలోడి పనే అది" అని ఎగిరిపోయింది. నాయుడిని పిలవమన్నది సాకలోడిని. సెమ్మా లూడగొట్ట మన్నది. సెర్మం వొలిసి డప్పుగట్టమన్నది. డప్పుగట్టీసి వాయించమంది. "లేకపోతే బాగోదు, సూడండి వియ్యపువారు మనకి ఎలాగ వాయించేస్తన్నారో" అని నాయుడిని వాయించేసింది.

రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదువా! నాయుడు తల్చుకున్నాడు- పువ్వుల కొరడా పట్టుకున్నాడు- అంతే.... నరాలు జివ్వుమని తెగిపోతున్నాయి అసిరిసెట్టికి. వీపుమీద కొరడా దెబ్బలు అచ్చులు పడి, దెబ్బదగ్గర చర్మం చిరిగిపోతోంది. నాయురాలు కోరినట్టుగా ఊడడంలేదు. ఊడితే డప్పు కట్టడంకోసం నాయుడుగారు కొడుతున్నారు. దెబ్బదెబ్బకీ చెర్మం చిరిగి, నరాలు తెగి రక్తం కారుతోంది.

ఎర్రగా.... కారుతోంది రక్తం!

పువ్వుల కొరడా.... ఎరుపయిపోతోంది!

నాయుడుగారి పందిరికింద గచ్చుమీద ఎర్రటి నెత్తురు మరకలు పడుతున్నాయి! రక్తం! ఎర్రటి రక్తం! సింధూరం లాంటి, తొలిసంధ్య లాంటి రక్తం! నరజాతి చరిత్ర సమస్తం రక్తసిక్తం! అపును చరిత్రనిండా రక్తమే! ఈ రక్తమే చరిత్రని మార్చింది!

ఈ రక్తమే చరిత్రని మార్చుతుంది!

రక్తాల ధారలు, అమ్మ నాయినా కేకలూ నాయుడుని శాంతింప జేయలేదు! అసిరిసెట్టికి వీపు మండుతోంది! కావిడి వద్ద పిల్లలు ఆప్యాయంగా తింటున్న దృశ్యం కన్పించింది! భయం, బెదురూ లేని వారి రూపాలు, వారి అమాయక మొహాలు అసిరిసెట్టిని కదిలించాయి.

అంతే, అసిరిసెట్టి కదిలాడు- నిటారుగా నిప్పులా లేచాడు- కొరడాకంటే వేగంగా.... కత్తికంటే పదునుగా, నాయుడుకంటే బలంగా లేచాడు!

భూస్వామ్య, ఫ్యూడల్ నిరంకుశత్వం మీద ఎదురుదెబ్బ వేసాడు!

పువ్వుల కొరడా అసిరిసెట్టి చేతిలో విరిగిపోయింది.

534